
# పుట్టినరోజు కానుక

పొట్లూరు సుబ్రమణ్యం



'వహా ర్యోదయానికేం తెలుసు సుబ్బారావు సమస్యలు' అన్నట్లు ఆ రోజు యథాప్రకారం తెల్లవారింది. ఆబిడ్స్‌లోని ఆ 'ఎక్స్‌పోర్ట్ అండ్ ఇంపోర్ట్' కంపెనీ ఆఫీసులో ఆ రోజు ఉదయం వచ్చిన సర్క్యులర్ మాత్రం ఆ ఆఫీసు స్టాఫ్‌కు ఎంతో ఆనందాన్ని కలిగించింది. దాంతోపాటు సుబ్బారావు సమస్యకూ పరిష్కారం దొరికింది. అది సుబ్బారావుకి శుభోదయం, మహోదయం.

అదేమిటంటే పై నెల పదవ తేదీన ఆ కంపెనీ ఛైర్మన్ పుట్టిన తేదీ వేడుకలు జరగబోతున్నాయని, ఆ పుట్టినరోజు వేడుకలకు సంబంధించిన ప్రోగ్రామ్స్ సెట్ చేయడానికి సాయంత్రం నాలుగు గంటలకు అందరూ మేనేజర్లు, డైరెక్టర్లు ఆరవ అంతస్తులోని కాన్ఫరెన్సు హాలులో హాజరు కావాలన్నది ఆ సర్క్యులర్ సారాంశం.

ఇప్పుడు సుబ్బారావుకి ఆనందమే ఆనందం. ఇదొక సువర్ణావకాశం. ఈ అవకాశం దొరకబుచ్చుకుని తన సహజమైన కాకాయిజాన్ని కాక్‌టెయిల్‌లా కలిపి, పై నుంచి కారే నీటిధారను పట్టుకుని ఆకాశానికి ఎగబ్రాకినట్లు తను ప్రమోషను కొట్టేయాలనుకున్నాడు సుబ్బారావు. ఇక్కడ సుబ్బారావు ప్రతిభ గురించి కాస్త చెప్పుకోవాలి. సుబ్బారావు అటెండరుగా పదేళ్ళ క్రితం అదే ఆఫీసులో అపాయింటయి పావులు కదుపుతూ తన తోటివారిని దాటుకుని ఇప్పుడు అసిస్టెంటు మేనేజరు అయ్యాడు. అంత వేగంగా, అంత తక్కువ సమయంలో, అంత పైకి ఎగబ్రాకినవారు ఆ అయిదు వందల మంది ఆఫీసు స్టాఫ్‌లో మరెవరూ లేరు.

అది మామూలు చిన్న కంపెనీ కాదు. ఆ కంపెనీ హెడ్ ఆఫీసు హైదరాబాదులో వున్నా దాని బ్రాంచి ఆఫీసులు దేశంలోని అన్ని రాష్ట్ర ముఖ్య పట్టణాల్లోనే ఉన్నాయి. అంతేగాక డయ్యూ, డామన్, అండమాన్, నికోబార్, లక్షద్వీపాలలో కూడా ఉన్నాయి. అక్కడ జీతాలు చాలా ఎక్కువ. అందుకే చాలామంది అక్కడ ఉద్యోగం రావడం గొప్పగా ఫీలవు తారు.

ఆ కంపెనీ ఛైర్మన్ వీర భద్రరావు. ఆయన ఏకైక కుమారుడు రామ భద్రరావు ఎం.డి. తండ్రి వీరభద్రరావు పుట్టినరోజు వేడుకలు ఆ ఆఫీసులోనే ఘనంగా చేయిస్తాడు రామ భద్రరావు. ఆ పుట్టినరోజు వేడుకల్లోనే ప్రమోషను పొందినవారి పేర్లను ఎనౌన్స్ చేస్తారు.

అందుకే ఆ రోజు ఉదయం నుంచీ ముందు మేనేజరును కాకాపట్టడం మొదలుపెట్టాడు సుబ్బారావు. అడుగడుక్కీ దండం, కదిలితే దండం, మెదిలితే దండం. గంటగంటకూ కాఫీ, ప్రతి రెండు గంటలకొకసారి సిగరెట్ ప్యాకెట్ పంపిస్తున్నాడు.

"ఇంతకీ ఏం కావాలి? నీ కోరిక తీర్చుతానని ప్రామిస్ చేస్తున్నాను" అన్నాడు అప్పారావు. సుబ్బారావు సేవలకు సంతుష్టుడై 'అంటే ఆరడి అవుతుంది, అనకుంటే అలుసవుతుంది' అన్న సామెత గుర్తొచ్చిన సుబ్బారావు చిన్నగా సకిలించి "అలా క్యాంటీన్ వైపు వెళ్లి మాట్లాడుకుందాం. పదండి సార్!" అంటూ ఆహ్వానించాడు.

'అంతా మా వాళ్ళేగానీ, అన్నానికి రమ్మనే వారు లేరు' అన్నట్లు ఇంతమందున్నా, సుబ్బారావంతటి వినయశీలురు లేరు అనుకొని అతని ఆహ్వానాన్ని మన్నించి అతని వెంట క్యాంటీన్‌కు వెళ్ళాడు అప్పారావు.

క్యాంటీన్‌లో వేడివేడి బజ్జీ ప్లేటుకు ఆర్డరిచ్చి తనే అందుకొని అప్పారావు ముందుంచాడు. ఆ

తరువాత కరకరలాడే పకోడా ప్లేట్లు. ఆనక బ్రూ కాఫీతో కార్యక్రమాన్ని పూర్తి 'చేయించి, విష్ణుమూర్తి వేలికి చక్రం తగిలించినట్లు, అప్పారావు చేతికి గోల్డ్ కింగ్స్ సిగరెట్ ప్యాకెట్ అందించాడు.

ప్యాకెట్ చించి సిగరెట్ నోట్లో పెట్టుకుని ఘాటుగా పీల్చిన అప్పారావు, పొగ మ్రింగి చిన్నగా వదులుతూ కళ్ళు మూసుకుని ఆ మధురానుభూతిని కొన్ని క్షణాలు అనుభవించి "కానీ...." అన్నాడు. భట్నాగర్ అవార్డు పొందిన సైంటిస్టులా ఫీలయ్యి.

సుబ్బారావు గొంతు సవరించుకుని "మన ఛైర్మన్‌గారి రాబోయే పుట్టినరోజు వేడుకల్లో నాకు సాంస్కృతిక కార్యక్రమాలు నిర్వహించే అవకాశం ఇప్పించాలి" అన్నాడు.

ఉలిక్కిపడి కళ్ళు తెరిచిన అప్పారావు "నువ్వేం సాంస్కృతిక కార్యక్రమాలు నిర్వహించగలవోయ్. సంగీతానికి బాలమురళీ కృష్ణని, నాట్యానికి కూచిపూడి శోభారాణిని పిలవాలనుకుంటుంటే..." అన్నాడు భయంగా.


ఏమాత్రం పట్టువీడని విక్రమార్కుడిలా "సార్ లోకల్ టాలెంట్‌ని గుర్తించడంలేదు. మంగళంపల్లి కంటే అద్భుతంగా పాడగల మేధావులు, శోభారాణి కంటే చక్కగా నాట్యం చేయగల లేడీస్ మన ఆఫీసులోనే వున్నారు. ఈ లోకల్ టాలెంట్‌ని చూసి మన ఛైర్మన్‌గారు, ఎం.డి.గారు గుమ్మయిపోవాలి" అన్నాడు సుబ్బారావు.

అంత్య నిష్ఠూరంకన్నా, ఆది నిష్ఠూరమే మేలనుకున్న అప్పారావు "వద్దు నాయనా! మనం ఎప్పటిలాగా వచ్చినవాళ్ళకు కూల్‌డ్రింక్స్, కాఫీలు, టిఫిన్‌లు అందించే సెక్షన్ చూసుకుందాం. కడుపులో చల్ల కదలకుండా వుంటుంది. పెద్ద కార్యక్రమాల జోలికి పోతే ఏదైనా తేడా వస్తే మన పరిస్థితి గుల్లే" అన్నాడు.

"సార్! మీరేమీ అనుమానించకండి. నాకు సంగీత సాహిత్యాల్లో, నాట్యంలో ప్రవేశముంది. సాంస్కృతిక కార్యక్రమాల నిర్వహణ మన సెక్షన్‌కు అలాట్ చేయించండి. నా ప్రతిభ నిరూపించుకుంటా, మీకు మంచిపేరు తెస్తా. చెప్పడం మరిచాను, రాత్రికి మీకు గ్రాండ్‌గా మందుపార్టీ అరేంజ్ చేశాను..." అప్పటికప్పుడు ఆలోచించుకుని కొసమెరుపులా చెప్పాడు సుబ్బారావు.

ఆఖరు మాట అమృతం చెవిలో పోసినట్లు అనిపించిన అప్పారావుకి, పెదాలు తడుపుకుంటూ "ఎక్కడ మందుపార్టీ? ఏ రేంజ్‌లో వుంటుంది?" అనడిగాడు. 'అందరి కాళ్ళకు మొక్కినా అత్తారింటికి పోక తప్పదు' అని నిర్ణయించుకున్న కొత్త పెళ్ళి కూతురిలా.

ఒక ఫైవ్‌స్టార్ హోటల్ పేరు చెప్పిన సుబ్బారావు, "రేంజి పది వేల రూపాయలు" అన్నాడు.




సుబ్బారావు మాటలకిప్పుడు పూర్తిగా లొంగిపోయిన అప్పారావు "సుబ్బారావ్! ఇంతకీ ఏం కోరి ఇంత అవస్థ పడుతున్నావు? ప్లెయిన్‌గా చెప్పు" అన్నాడు.

"సార్ ఈ దెబ్బతో నాకెంత పేరు వస్తుందో, మీకూ అంత పేరు వస్తుంది. ఛైర్మన్‌గారు తన బర్త్‌డే గిఫ్ట్‌గా మీకు డైరెక్టరు ప్రమోషను ఇచ్చి, నాకు మేనేజరు ప్రమోషను ఇస్తాడు. ఏం మీకిష్టం లేదా?" అన్నాడు సుబ్బారావు ఊరిస్తూ.

ఎగిరి గంతేసిన అప్పారావు "ఎందుకిష్టం లేదు. నేను ఓ.కే. నువ్వు మాట తప్పకూడదు" అని మందుపార్టీని పరోక్షంగా గుర్తుచేసిన అప్పారావు అక్కడ నుండి లేచాడు.

తిరిగి ఇద్దరూ ఆఫీసుకు వచ్చారు.

ఆ రోజు సాయంత్రం నాలుగు గంటలకు అందరు మేనేజర్లందరూ డైరెక్టర్లు కాన్ఫరెన్సుకు వెళ్ళారు. తన సెక్షను మేనేజరు అప్పారావుని కూడా సకల మర్యాదలతో లిఫ్టులో కాన్ఫరెన్సు జరిగే ఆరవ అంతస్తుకు పంపి, తన అనుయాయులైన పన్నెండు మందితో మాట్లాడి రెండు టీములుగా చేశాడు సుబ్బారావు. ముగ్గురు ఆడవాళ్ళను, ముగ్గురు మగవాళ్ళను సంగీతానికి, ముగ్గురు ఆడవాళ్ళను, మరో ముగ్గురు మగవాళ్ళను నాట్యానికి ఎన్నుకున్నాడు. వాళ్ళకు భవిష్యత్తులో రాబోయే ప్రమోషన్ల గురించి వివరించి, వాళ్ళ దగ్గర మందుపార్టీకి డబ్బులు వసూలుచేశాడు. అంతేగాక మగవాళ్ళను మందుపార్టీకి ఆహ్వానించాడు.

సక్సెస్‌ఫుల్‌గా తను కోరింది సాధించుకు వచ్చిన అప్పారావుని ఆ రోజు రాత్రి మందుపార్టీలో ముంచి తేల్చాడు సుబ్బారావు తన అనుచర బృందంతో.

రోజులు గడుస్తున్నాయి. సుబ్బారావు నగరంలోని ఒక మూల గది తీసుకుని తనే దగ్గరుండి, ఉదయం ఏడు గంటల నుంచి తొమ్మిది గంటల దాకా ఒక బృందానికి సంగీతంలో శిక్షణనిప్పిస్తున్నాడు. అదే విధంగా అదే గదిలో సాయంత్రం ఆరు గంటల నుంచి ఎనిమిది గంటల వరకూ మరో బృందానికి నాట్యంలో తర్ఫీదునిప్పిస్తున్నాడు. పగలు పది గంటల నుంచి సాయంత్రం ఐదు గంటల వరకూ ఆఫీసులో పని. ఇలా సుబ్బారావు ఉదయం నిద్ర

# మాస్టర్ హెర్బ్స్ ప్రై. లి. వారి కొత్త ఉత్పత్తులు

హైదరాబాదు కేంద్రంగా 1999లో స్థాపించబడిన మాస్టర్ హెర్బ్స్ ప్రై. లిమిటెడ్ 'సహజ' పేరు గల మూలికల ఉత్పత్తులని విక్రయిస్తున్నది. ఈ సంస్థ గత మూడేళ్ళుగా క్రమంగా వృద్ధి చెందుతూ భారతదేశంలోని ఆరు రాష్ట్రాలకి తన కార్యకలాపాల్ని విస్తరించుకున్నది. ఈ కంపెనీ ప్రధాన ఉత్పత్తి 'సహజ బస్ట్ క్రీమ్'. పది దేశాలలో దీనిని నేరుగా కొనుగోలు చేసే వాడకందారులున్నారు. మూడేళ్ళ వ్యవధిలోనే లక్షమంది వాడకందార్లని 'సహజ' సమకూర్చుకున్నది.

'సహజ' బస్ట్ క్రీమ్ విజయం సాధించటంతో ఈ సంస్థ ఇప్పుడు 'సహజ యాంటీ రింకిల్ క్రీమ్', 'సహజ హెర్బల్ ఫేస్ క్రీమ్'లని మార్కెట్‌లో ప్రవేశపెడుతున్నది.

సహజ యాంటీ రింకిల్ క్రీమ్ ముఖంపై ముడతలు రాకుండా నిరోధిస్తుంది. కాలక్రమంలో బలహీన పడే ముఖ చర్మ కణాలకి తగిన విధంగా మాయిశ్చరైజర్‌ని అందిస్తుంది. దీనిలోని లోధ్ర, క్విన్స్ సీడ్స్, ఘృత్ కుమారి ఆల్మండ్ ఆయిల్, తులసి మొదలైనవాటిలోని ఔషధ గుణాలు ముఖంపై చర్మ కణాలని పునరుజ్జీవింప చేస్తాయి. వాటిలోని ఏ, ఇ విటమిన్‌లు వయో ప్రభావాన్ని నిరోధిస్తాయి. తులసి యాంటీ సెప్టిక్, యాంటీ ఫంగల్ గుణాలని కలిగి ఉన్నటువంటిది. సహజ రింకిల్ క్రీమ్ 20 గ్రా., 40 గ్రా. సైజు ప్యాక్‌లలో దొరుకుతుంది.

సహజ హెర్బల్ ఫేస్ క్రీమ్ చందన, హల్దీ, కేసర్, ఆల్మండ్ ఆయిల్‌తో పాటు కుంకుమాది తైలం కూడా ఉన్న ప్రత్యేక మిశ్రణం ఈ క్రీమ్. సహజ హెర్బల్ ఫేస్ క్రీమ్ బహుళ ప్రయోజనాలు కలది. మొటిమల నివారణకి, చర్మాన్ని మాయిశ్చరైజ్ చేయటానికి, ముఖం మరింత అందంగా కనిపించటానికి, మెరిసిపోయే ముఖ వర్ఛస్సుకి ఇది తోడ్పడుతుంది. ఈ క్రీమ్ 40 గ్రా. కల ఒకే సైజ్ ప్యాక్‌లలో లభ్యమవుతుంది.

ఈ క్రీముల ఉపయోగంలో కూడా ఒక ప్రత్యేకత ఉన్నది. పగటిపూట వీటిని వాడకూడదు. రాత్రి పడుకునే ముందు ముఖానికి రాసుకుని మరునాడు ఉదయం లేవగానే కడిగేయవచ్చు. ఇందువల్ల క్రీమ్ చర్మంలోకి ఇంకి రాత్రంతా పనిచేస్తుంది.

సహజ ఆయుర్వేద ఉత్పత్తులన్నీ ప్రాచీన ఆయుర్వేద గ్రంథాల నుంచి గ్రహించిన ఫార్ములేషన్స్‌తో కూడుకున్నవి. ఆధునిక అవసరాలకి తగిన పద్ధతిలో పరీక్షింపబడినట్టివి. ప్రకృతి సిద్ధమైనవి కాబట్టి ఎలాంటి దుష్ఫలితాలకీ తావుండదు. ప్రభుత్వ ఆమోదం పొందిన లేబొరేటరీలలో ముడి పదార్థాలని పరీక్షిస్తారు.

సంస్థ ప్రధాన ఉత్పత్తి అయిన సహజ బస్ట్ క్రీమ్ స్త్రీలలో సడలిన వక్షోజాల బిగువుని మెరుగు పరుస్తుంది. సాగిపోయిన వక్షోజ కణాలని సరిదిద్ది వాటి సహజమైన అందాన్ని తిరిగి పొందేలా చేస్తుంది. ముజఫల్, కూట్‌రూట్, వచా, నాగ్‌బల, కపిషంథీ తైలాలతో కూడి ఉన్న సహజ బస్ట్ క్రీమ్ 20 గ్రా., 40 గ్రా., 60 గ్రా. ప్యాక్‌లలో లభ్యమవుతుంది.

మాస్టర్ హెర్బ్స్ ప్రై. లి. వారు త్వరలో ఒక ప్రత్యేకత కలిగిన హెర్బల్ హెయిర్ ఆయిల్‌ని, ప్రకృతిసిద్ధమైన హెర్బల్ షాంపూని విడుదల చేయనున్నారు. భారతీయ ఆయుర్వేధ పరిజ్ఞానాన్ని మానవాళి శ్రేయస్సుకి వినియోగించాలన్నదే తమ లక్ష్యం అని ఆ సంస్థ మేనేజింగ్ డైరెక్టర్ శ్రీ కామేశ్వర్‌రావు ఒక పత్రికా ప్రకటనలో తెలియజేశారు.

- ఒ.వి



లేచింది మొదలు రాత్రి పడుకోబోయే దాకా క్షణం తీరిక లేకుండా వున్నాడు.

సుబ్బారావు ఇప్పిస్తున్న శిక్షణ గురించి వింటున్న కొద్దీ అప్పారావు హృదయం అమితానందంతో పొంగిపోతోంది. సూర్యుడి చుట్టూ భూమి పరిభ్రమిస్తున్నట్లు, తన చుట్టూ ప్రమోషను తిరుగుతున్నట్లు ఫీలవుతున్నాడు.


అనుకున్న రోజు రానే వచ్చింది. ఆ రోజు ఉదయం ఛైర్మన్ గారి పుట్టినరోజు వేడుకలు విశాలమైన ఆ ఆఫీసు ఆవరణలో వేసిన ప్రత్యేక స్టేజీమీద గ్రాండ్‌గా జరిగాయి.

అందరూ తమతమ అభిరుచి మేరకు తమతమ స్థాయిల్లో ఛైర్మన్‌గారికి ప్రెజెంటేషన్లు ఇచ్చారు. సుబ్బారావు తన నాట్యబృందంతో వెళ్ళి నటరాజ విగ్రహాన్ని, సంగీతబృందంతో వెళ్ళి సరస్వతి విగ్రహాన్ని బహూకరించాడు.

"ఎవరితను?" ప్రక్కనే వున్న అప్పారావుని అడిగాడు ఛైర్మన్.

ఛైర్మన్ గారి దగ్గరకు ఏ పనున్నా మేనేజరు స్థాయి ఉద్యోగులు తప్ప క్రింది స్థాయి ఉద్యోగులు ఎవరూ వెళ్ళరు. అందుకే సుబ్బారావు ఎవరో ఛైర్మన్‌కి తెలియదు.

"నా అసిస్టెంటు మేనేజర్ సార్. పేరు సుబ్బారావు. ఈ రోజు సాయంత్రం జరిగే



## ఆరోగ్యకరమైన ఫ్రిజ్

సాధారణంగా మనం ఫ్రిజ్‌లో చాలా ఆహార పదార్థాలు పెట్టి మర్చిపోతుంటాం. రోజూ వంటిల్లు సర్దుకుంటుండగా మిగిలినవన్నీ చిన్నచిన్న డబ్బాలలో సర్దిపెట్టేసి ఫ్రిజ్‌లో పెడుతుంటాం. వాటిని ఫ్రిజ్ ఓపెన్ చేసినప్పుడల్లా చూస్తుంటాం. కానీ. ఏవో కారణాలవల్ల లేదా ఏ కారణమూ లేకుండానే వాటిని తినడం వాయిదా వేస్తుంటాం. సరిగ్గా ఆర్గనైజ్ చేసుకుంటే, ఫ్రిజ్‌లో రెడీగా తినడానికి ఉండేవాటితో ఒకరోజు వంట చేయడం కూడా మానివేయవచ్చు. నెలకొకసారి చెక్ చేసుకొని, తినడానికి పనికిరానివన్నీ తీసి పారేయండి. బయట నుండి తెచ్చిన ఫుడ్ ఏదైనా ఉంటే, దానిని మరుసటి రోజే తినేయడం మంచిది. ఇంట్లో చేసినవాటికన్నా, బయట తయారైన ఫుడ్ చాలా తొందరగా పాడవుతుంది. ప్లాస్టిక్ ఎయిర్ టైట్ కంటెయినర్స్‌లో ఆహారపదార్థాలు స్టోర్ చేసుకుంటే ఫ్రెష్‌గా ఉంటాయి. మీరు వర్కింగ్ విమెన్ అయితే, కాయగూరలు కట్ చేసి పెట్టుకుంటే, రెడీగా కూర చేసుకోవటానికి వీలవుతుంది. గోధుమ పిండి 2, 3 రోజులకు సరిపడా తడిపి పెట్టుకోవచ్చు. దోసె పిండి, ఇడ్లీపిండి కూడా 2, 3 రోజులకు సరిపడా రెడీగా ఉంచుకుంటే రోజూ బ్రేక్‌ఫాస్ట్‌కి వెతుక్కోనక్కరలేదు. ఫ్రిజ్‌లో ఉంచడం వలన పిండి పులవదు. ఫ్రూట్స్, ఫ్రిజ్‌పైన అందరికీ కనబడేలా పెడితే, వీలుగా ఉండి వెంటనే తీసుకొని తింటారు.

డైటింగ్ చేసేవాళ్ళెవరైనా ఇంట్లో ఉన్నట్లయితే, డెసర్ట్స్, ఐస్‌క్రీమ్స్ వారికి కనబడకుండా దాచండి. మీరు లీజర్‌గా ఉన్నప్పుడు లేదా హుషారుగా ఉన్నప్పుడు వంటని కొంచెం పొడిగించి చేసుకుంటే టైట్ వీకెండ్‌కో లేదా అనుకోని అతిథి భోజనానికి వచ్చినపుడు పనికొస్తుంది.. అల్లం, వెల్లుల్లి, కొబ్బరి, గసగసాల ముద్దలు, టమాటా ప్యూరీ, కొబ్బరిపాలు ఇవి కూడా వీలునుబట్టి తయారుచేసుకుని ఛిల్ ట్రేలో పెట్టుకుంటే బిరియానీ, కుర్మాలు చిటికెలో తయారు చేసుకోవచ్చు. బ్రేక్ ఫాస్ట్‌లోకి కొబ్బరి చెట్నీ కూడా వారానికి సరిపడా ఒకేసారి చేసి పెట్టుకుంటే, అవసరమైనంత తీసి, రోజూ తాలింపు ఫ్రెష్‌గా పెట్టి వాడుకోవచ్చు. ఫ్రిజ్‌లో పెట్టింది పాచి వస్తువు అని పారేసుకోకుండా వెంటవెంటనే వాడుకుంటే ఇంట్లో అదే మన భోజనాన్ని గైడ్ చేసే పెద్ద దిక్కు అవుతుంది. హెల్తీ రిఫ్రిజిరేటర్‌ను తయారు చేసుకోవడం, దాన్ని మాగ్జిమమ్ ఉపయోగించు కోవడం మన చేతిలోనే ఉంది.

**- శైలజా రాంషా**

సాంస్కృతిక కార్యక్రమాలు ఈయన ఆధ్వర్యంలోనే జరుగుతాయి" వినయంగా వివరించాడు అప్పారావు.

"భేష్! సుబ్బారావు కళాకారుడు కనుకనే కళాత్మకమైన ప్రెజెంటేషన్లు ఇచ్చాడు..." అన్నాడు ఛైర్మన్ అభినందిస్తూ.

ఆ అభినందనలకు సుబ్బారావు ఆకాశంలో తేలిపోయాడు. అప్పారావుకీ అంతే. ఎగురుతున్న సుబ్బారావు కాళ్ళు పట్టుకొని తనూ ఆకాశంలోకి వెళ్ళినట్లు ఫీలయ్యాడు. ఛైర్మన్‌గారు అందరికీ ఒక నెల జీతం బోనస్‌గా ప్రకటించి తన స్టాఫ్‌ను ఆనందింపజేశాడు.

ఆ మధ్యాహ్నం వెజ్ ఫుడ్, నాన్ వెజ్ ఫుడ్ పార్టీ ఏర్పాట్లు, ఎ-సెక్షను, బి-సెక్షను ఆధ్వర్యంలో జరిగాయి గ్రాండ్‌గా. లంచ్ అయిన తరువాత అందరూ వెళ్ళిపోతే జడ్ సెక్షన్‌కు చెందిన సుబ్బారావు మాత్రం అక్కడే వుండిపోయాడు తన బృందంతో.

ఎందుకంటే, అన్ని కార్యక్రమాల్లోకి సాంస్కృతిక కార్యక్రమాలు అతి ముఖ్యమైనవి. వాళ్ళకి తగు సలహాలు, సూచనలు నిరంతరం ఇస్తుండాలి.

ఆ సాయంత్రం దేదీప్యమైన లైట్ల వెలుగులో స్టేజీ కళకళలాడిపోతూ వుంది. ఎదురుగా మొదటి వరుసలో మధ్యలో ప్రత్యేకమైన ఆసనాలలో ఛైర్మన్‌గారు, ఎం.డి.గారు కూర్చుంటే వారికి అటు ఇటుగా డైరెక్టర్లు, మేనేజర్లు తమకు కేటాయించిన కుర్చీలలో కూర్చుని ఉన్నారు.

స్టేజీమీదికొచ్చిన సుబ్బారావు, మొదట ఛైర్మన్‌గారికి పుట్టినరోజు శుభాకాంక్షలు తెలిపి, ఎం.డి.గారికి నమస్కారం పెట్టి అప్పారావుగారి అమూల్యమైన సలహాతో తానీ బాధ్యత స్వీకరించానని వివరించాడు.

తదుపరి "ఇప్పుడు మీరు మీ జీవితంలో ఎన్నడూ చూడని అద్భుతమైన నాట్య ప్రదర్శనను చూస్తారు" అంటూ స్టేజీమీది ఒకవైపుకొచ్చి నిలబడ్డాడు.

స్టేజీమీద ఒక మూల కూర్చుని కొందరు సంగీత విద్వాంసులు పాడుతూ వుంటే ఒక నృత్య రూపకం మొదలయ్యింది. నాట్యం చేస్తూ స్టేజీమీదికొచ్చారు సుబ్బారావు తర్ఫీదునిచ్చిన బృందం.

ఆ కళాకారులు చేస్తున్న నాట్యం ఎం.డి.గారికి అర్థం కాలేదు. అది నాట్యమా, కోతుల కుప్పిగంతులా? నాట్యం గురించి తెలిసిన ఛైర్మన్‌గారి ముఖం నల్లగా మాడిపోయింది.

కానీ ఇవేమీ గమనించకుండా సన్నగా నల్లగా, పొడవుగా, గ్రద్దముక్కు, బట్టతలతో షూ వేసి, టై

కట్టే పాటులో విచిత్రంగా వున్న ఆర్గనైజరు సుబ్బారావు స్టేజీమీద ఒక మూల నిలబడి ఆ నాట్యానికి పరవశించిపోతూ తన చేతులతో తాళం వేస్తూ పారవశ్యంతో తల ఊపుతున్నాడు.

భరతనాట్యం కాగానే చప్పట్లు మోగుతాయనుకున్న సుబ్బారావుకి అలాంటివేమీ కనిపించలేదు. కాని తాను ఆల్రెడీ అష్టదిక్కుల్లో నిలబెట్టి వున్న తన మనుషులు మాత్రం లేచి "వహ్వా ఎంత బాగుంది నాట్యం?" అంటూ చప్పట్లు కొట్టారు. తాము తప్ప మిగతావాళ్ళెవరూ కొట్టలేదని వాళ్ళకు తెలుసు. కానీ కొట్టక తప్పదు. ఎందుకంటే ఇప్పుడు జరగబోయే తమ సంగీత కార్యక్రమానికి నాట్యంచేసినవాళ్ళు చప్పట్లు కొట్టాలి మరి. ఇలా ఆపత్కాల సమయమొస్తుం దని ముందే ఊహించిన సుబ్బారావు తెలివిగా చేసిన ఏర్పాటు.

నాట్యబృందం తమ కార్యక్రమం పూర్తి చేసుకుని క్రిందకి దిగగానే సుబ్బారావు మైకు దగ్గరకొచ్చి "ఇప్పటివరకూ మీరు నాట్య మయూరాల నాట్యం చూసి మురిసిపోయారు. ఇప్పుడు మీరు సంగీత గానలహరిలో తేలిపోతారు..." అంటూ అనౌన్సు చేశాడు.

అప్పటికే ఛైర్మన్‌గారికి, ఎం.డి.గారికి తలనొప్పితో తలలు పగిలిపోతున్నాయి. అందరి పరిస్థితీ అదే. అయినా ఛైర్మన్‌గారి బర్త్‌డే కనుక తమ సీట్లలోంచి ఎవరూ కదలలేదు.

"ఇది శంకరాభరణమూ..." అంటూ ఎత్తుకున్నారు స్టేజీమీదికొచ్చిన సంగీత కళాకారులు.

ఆ కంఠాలు కర్ణకఠోరంగా వున్నాయి. తరువాత లలితగీతాలు, తరువాత జానపద గేయాలు, ఘోరంగా పాడి వినిపించారు. ఆర్కెస్ట్రా ఇచ్చే మ్యూజిక్కుకూ, వీళ్ళందించే సంగీతానికి ఎక్కడా పొంతన లేదు.

యథారీతి సుబ్బారావు తన్మయత్వంతో తల ఊపడం, ప్రోగ్రాం కాగానే ప్రేక్షకుల్లో ఎనిమిది దిక్కుల్లో నిలబడి వున్న నాట్యబృందంలోని మనుషులు "ఆహా సంగీతం ఎంత బావుంది?" అని పొగుడుతూ సంగీత కళాకారులకు కృతజ్ఞతాపూర్వకంగా చప్పట్లు కొట్టి వాళ్ళ ఋణం తీర్చుకోవడం జరిగిపోయింది. ప్రేక్షకులు మాత్రం 'భూలోకంలో యమలోకంలా' ఫీలవుతున్నారని మాత్రం అర్థం చేసుకోలేకపోయాడు సుబ్బారావు.

ఛైర్మన్‌గారికి, ఎం.డి.గారికయితే మూర్ఛ వచ్చినంత పనైంది. ఇంత భయంకరంగా కార్యక్రమాలు ఏర్పాటుచేసిన సుబ్బారావు వైపు క్రూరంగా చూశారు. ఆ క్రూరమైన చూపుల్ని చల్లని ఆశీర్వాదాలుగా భావించిన సుబ్బారావు అందరివైపూ చూసి, వాళ్ళు తనకొచ్చిన గుర్తింపుకు ఈర్ష్య పడుతున్నట్లుగా అర్థం చేసుకున్నాడు.

మైకు దగ్గరకొచ్చి టై సర్దుకుని, పళ్ళు ఇకిలించి, గొంతు సకిలించి "ఇప్పటివరకూ మీరు కనువిందైన నాట్యాన్ని, వినసొంపైన సంగీతాన్ని ఆస్వాదించారు. నాట్యం చేసిన వారికి నాట్య మయూరాల బిరుదులు, సంగీతం పాడినవారికి సంగీత సామ్రాట్ బిరుదులు ఇప్పుడు ఛైర్మన్‌గారు ఇస్తారు" అంటూ తనకు తానే ఒక డెసిషన్ తీసుకుని, అందరికీ చేయి ఊపి స్టేజీ దిగాడు సుబ్బారావు.

ఛైర్మన్‌గారు, ఎం.డి.గారు స్టేజి మీద తమకేర్పాటు చేసిన ఆసనాల్లో కూర్చున్నారు. తరువాత ఛైర్మన్‌గారు మైకు దగ్గరకొచ్చి మాట్లాడ్డం మొదలుపెట్టారు. ఆయన గొంతు నూట నాలుగు డిగ్రీల జ్వరపీడితుడి గొంతులా వణుకుతోంది.

"మన జాతీయపక్షి నెమలి. ఇది నాట్యానికి సింబల్. నెమలిని మించిన కూచిపూడి శోభారాణి నాట్యాన్ని చూసిన ఈ అద్భుతమైన కనులు ఈరోజు పనికిమాలిన వానర చిందుల్ని చూశాయి. బాలమురళీకృష్ణ మధురమైన గొంతులోని రసామృతాన్ని ఆస్వాదించిన ఈ కర్ణాలు కోకిల గొంతులకు బదులు కాకి అరుపులు విన్నాయి. ఈ రోజు బర్త్‌డే సందర్భంగా నన్నింత క్షోభ పెట్టిన నాట్యబృందాన్ని అండమాన్ దీవికి, సంగీతబృందాన్ని నికోబార్ దీవికి ట్రాన్స్‌ఫర్ చేస్తున్నాను. అలాగే ఈ ఛండాలపు సాంస్కృతిక కార్యక్రమాలు ఏర్పాటుచేసిన సుబ్బారావుని డయ్యూ దీవికి, దీనికంతటికీ కారణమైన అప్పారావుని డామన్ దీవికి ఇప్పుడే ట్రాన్స్‌ఫర్ చేస్తున్నాను. ఇదే వాళ్ళకు నా బర్త్‌డే గిఫ్ట్... " అని కొద్దిగా గాలి పీల్చుకున్న ఛైర్మన్‌గారు "ఇంతకీ వీళ్ళేరి?" అన్నాడు.

ఇంకెక్కడుంటారు వాళ్ళు? కాకా కాస్తా బెడిసి పీకమీదికొచ్చి 'డయ్యూ దీవికి ట్రాన్స్‌ఫర్ అనే సరికి ఎప్పుడో గోడ దూకి పారిపోయాడు సుబ్బారావు. బ్రతికుంటే బలుసాకు తినొచ్చని అప్పారావు, మొహమాటానికి పోతే ఏదో వచ్చిందని నాట్య, సంగీత బృందాలు తుపానులో కట్టు తెంపుకుని పారిపోయే పెంపుడు జంతువుల్లా, చడీ చప్పుడు లేకుండా ఆ ప్రాంతాలు వదిలి స్కూటర్ల మీద దొరికిన సిటీబస్సు లెక్కి, ఆటోలు పట్టుకుని అక్కడి నుంచి అదృశ్యమయ్యారు. ❋

